

17న మిగిలిన పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు

గుజరాతీపేట, ఆగస్టు 9: జిల్లాలోని ఈ నెల 8న పలు కారణాలతో వివిధ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్ఎంసీ) ఎన్నికలు జరగలేదు. అటువంటి పాఠశాలల్లో ఈ నెల 17న ఎన్నికలు నిర్వహించేందుకు డీఈవో ఎస్.తిరుమల చైతన్య ఆదేశాలు జారీ చేశారు. దీనికోసం ఈ నెల 10న నోటిఫికేషన్ జారీ చేస్తామని, అదే రోజు మధ్యాహ్నం నోటీసు బోర్డులో ఓటరు జాబితా ప్రదర్శిస్తామని డీఈవో చెప్పారు. 12న ఓటరు జాబితాపై అభ్యంతరాలు ఉంటే ఫిర్యాదు చేయాలన్నారు. అదేరోజు మధ్యాహ్నం ఓటు జాబితాను ఖరారు చేస్తామని, 17న ఎస్ఎంసీ ఎన్నిక నిర్వహిస్తామని తెలిపారు.

సమగ్ర గిరిజనాభివృద్ధే లక్ష్యం

- పంటలు అమ్మేందుకు ప్రత్యేక యాప్
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
- ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

హిరమండలం, ఆగస్టు 9: జిల్లాలో సమగ్ర గిరిజాభివృద్ధే లక్ష్యంగా అన్ని చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. శుక్రవారం హిరమండలం సుభలయ ఆర్అండ్ఆర్ కమ్యూనిటీ భవనంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అటవీ పరిరక్షణతో పాటు గిరిజన హక్కులు, చట్టాలను కాపాడుతామన్నారు. గిరజనాభివృద్ధికి అన్ని చర్యలు చేపడతామని చెప్పారు. 'గిరిజనులు అన్ని రంగాల్లో ముందుండాలి. అటవీ ఉత్పత్తులతో పాటు పొందూరు ఖాదీ, పలాస జీడిపప్పు, జూట్ ఉత్పత్తుల అమ్మకానికి ఆన్‌లైన్ వ్యవస్థను తీసువస్తాం. ఇందుకోసం ప్రత్యేక యాప్‌ను రూపొందిస్తాం. అటవీ ఉత్పత్తులను భద్రపరిచేందుకు కోల్డు స్టోరేజ్‌లను ఏర్పాటు చేస్తాం. సీతంపేట మండలం ఆడలి వ్యూ పాయింట్ నుంచి వంశధార రిజర్వాయర్, గొట్టా బ్యారేజీ, శ్రీముఖలింగం కలుపుతూ టూరిజం హబ్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక తయారు చేస్తాం. ఆదివాసీల కోసం ఫుడ్ ప్రోసెసింగ్ యూనిట్లతో పాటు స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలను నెలకొల్పుతాం. ఈ నెల 15న గిరిజనులకు పట్టాలు అందజేస్తాం. హిరమండలంలో గిరిజన కమ్యూనిటీ భవన నిర్మాణానికి కృషి చేస్తాం. సుభలయ ఆర్ఆర్ కాలనీ ప్రాథమికోన్నత పాఠశాలను ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేసేందుకు చర్యలు తీసుకుంటాం.' అని కలెక్టర్ తెలిపారు. జడ్పీటీసీ పి.బుచ్చిబాబు మాట్లాడుతూ.. పాతపట్నం నియోజక వర్గంలోని పలు గిరిజన గ్రామాల్లో తాగునీరు, రహదారి సదుపాయం లేవని చెప్పారు. గిరిజన జీవన ప్రమాణాల మెరుగుకు, మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్, ఐటీడీఏ పీవోను కోరారు. అలాగే శ్రీకాకుళం జిల్లాలో ఐటీడీఏ కార్యాలయం ఏర్పాటు చేయాలని కోరారు.



నృత్యం చేస్తున్న గిరిజన విద్యార్థినులు



హిరమండలంలో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఆదివాసీల చెంతకు అభివృద్ధి ఫలాలు..

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఆదివాసీల చెంతకు చేర్చేందుకు కృషి చేస్తామని సీతంపేట ఐటీడీఏ పీవో టి.రాహుకుమాల్ రెడ్డి అన్నారు. 'డోలీ మోత లేని గిరిజన గ్రామాలుగా తీర్చి దిద్దుతాం. ఐటీడీఏ పరిధిలోని పాఠశాలలో పనిచేసేందుకు 51 మంది ఏఎస్ఎంలు, వాచ్‌మెన్‌లు అవసరముందని ప్రభుత్వానికి నివేదిక పంపించాం. గిరిజన డీఎస్సీ అభ్యర్థుల కోసం ఉచిత కోచింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తాం. హైరిస్క్ గర్భిణిల కోసం సీతంపేటలో ప్రెగ్నెంట్ ఉమెన్స్ హాస్టల్ ఏర్పాటు చేస్తాం. గిరిజన సమస్యలను తెలియజేసేందుకు మందసం మండలంలోని చీపి గ్రామంలో గ్రీవెన్స్ నిర్వహిస్తాం. జలజీవన్ మిషన్ ద్వారా గిరిజన గ్రామాల్లో తాగునీటి సమస్యను తీరుస్తాం.' అని పీవో తెలిపారు. ముందుగా అటవీ ఉత్పత్తుల స్టాల్స్‌ను కలెక్టర్, పీవో పరిశీలించారు. కొన్ని వస్తువులను కలెక్టరు కొనుగోలు చేశారు. గిరిజన విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. టెక్కలి ఆర్డీవో సుదర్శనదొర, ఎంపీడీవో స్వరూపరాణి, తహసీల్దారు బి.వెంకటరమణ, ఎంఈవో కె.రంబాబు, సర్పంచ్ లంక రోజారాణి, ఎంపీటీసీ చింతాడ బుడ్డు, చిన్నయ్య ఆదివాసి వికాస సంఘం అధ్యక్షురాలు పడాల భూదేవి, యాళ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆ 196 ఎకరాలు ఎవరివి?

- ఇనాం భూములంటున్న అధికారులు
- కాదంటున్న రొట్టవలస రైతులు
- 67 ఏళ్లుగా పరిష్కారంకాని సమస్య
- న్యాయం చేయాలని ఎమ్మెల్యే రవికుమార్‌కు విన్నపం



రైతులు సాగు చేస్తున్న భూములు ఇవే..

ఆ గ్రామ రైతులు ఆరు దశాబ్దాలకు పైగా ఆ భూములను సాగు చేసుకుంటున్నారు. వాటిపై బ్యాంకు రుణాలు సైతం పొందారు. కొందరు రైతులు క్రయవిక్రయాలు కూడా చేపట్టారు. ఆ భూముల్లో వంశధార కుడి కాలువను తవ్వారు అధికారులు. రైతులు నష్టపరిహారం అడిగితే అవి ఇనాం భూములని అధికారులు అంటున్నారు. కాదు తమవేనని, పరిహారం చెల్లించాలని రైతాంగం కోరుతున్నా ఫలితం శూన్యం. ఏళ్ల తరబడి ఆ భూములపై వివాదం నడుస్తున్నా పరిష్కారం మాత్రం కావడం లేదు. ఇదీ సరుబుజ్జిలి మండలం రొట్టవలసలోని 196 ఎకరాల భూముల కథ. కూటమి ప్రభుత్వమే న్యాయం చేయాలని రైతులు వేడుకుంటున్నారు. -(సరుబుజ్జిలి)





భూముల్లో వంశధార కాలువను తవ్విన దృశ్యం

మండలంలోని రొట్టవలస రెవెన్యూ గ్రామంలో వివిధ సర్వే నెంబర్లలో సుమారు 196 ఎకరాల భూములు ఉన్నాయి. ఈ భూములను ఆ గ్రామానికి చెందిన పలువురు రైతులు 67 ఏళ్లగా సాగు చేసుకుంటున్నారు. కొందరు రైతులు ఈ భూములపై బ్యాంకుల నుంచి రుణాలు కూడా పొందారు. ఇంకొందరు భూముల క్రయవిక్రయాలు చేపట్టి రిజిస్ట్రేషన్లు కూడా చేయించుకున్నారు. అయితే, ఈ భూముల్లో 2005లో వంశధార కుడి ప్రధాన కాలువ నుంచి పిల్ల కాలువ తవ్వకం చేపట్టారు. దీనికోసం గ్రామానికి చెందిన 50 మంది రైతులకు చెందిన భూములను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి నష్టపరిహారం మాత్రం నేటికీ రైతులకు చెల్లించలేదు. దీనిపై పలు మార్లు రెవెన్యూ అధికారులను సం ప్రదించగా ఇనాం భూములంటూ నష్టపరిహారం చెల్లించడం నిలిపివేశారని రైతులు వాపోతున్నారు. అప్పటి నుంచి వీరి గోడు జిల్లా అధికారులకు చెబుతూనే ఉన్నారు. నేటికీ పరిష్కారానికి నోచుకోలేదు. 1992లో అప్పటి ప్రభుత్వం ఈ భూములపై ఒకసారి సర్వే నిర్వహించింది. అయినా ఇప్పటివరకు అధికారులు ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. రైతులు 1957 నుంచి 2005 వరకు సీటీటీ రువా చెల్లించారు. టెన్‌వన్ అడంగల్ ఆధారంగా బ్యాంకుల ద్వారా రుణాలు పొందారు. 2006లో భూముల స్వాధీనానికి సంబంధించి అప్పటి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై 2007 మేలో, 2008 మార్చిలో అప్పటి కలెక్టర్‌కు ఫిర్యాదుల విభాగంలో రైతులు వినతిపత్రాలు అందించారు. అయినప్పటికీ తమకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భూముల క్రయ విక్రయాలు చేసుకుంటూ ఆమదాలవలస సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో హక్కు పత్రాలను పొందుతున్నా రెవెన్యూ అధికారులు పట్టాదారు పాస్‌పుస్తకాలు మంజూరు చేయడంలో జాప్యం చేస్తున్నారని వాపోతున్నారు. ఇటీవల గ్రామంలో పర్యటించిన ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్‌ను తెలుగుయువత మండల అధ్యక్షుడు తాడేల రాజారావు ఆధ్వర్యంలో రైతులు కలిశారు. తమ భూముల సమస్యను పరిష్కరించి న్యాయం చేయాలని కోరారు.



ఎమ్మెల్యే రవికుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతులు (ఫైల్)

రైతులను ఆదుకోవాలి..

67 సంవత్సరాలుగా రైతుల సాగులో ఉన్న రొట్టవలస ఇనాం భూముల సమస్యను ఎన్ని ప్రభుత్వాలు మారినా పట్టించుకోవడంలేదు. కూటమి ప్రభుత్వ పాలకులైనా ఈ సమస్యను పరిష్కరించాలి.

-తాడేల వెంకటరమణ, మాజీ సర్పంచ్, రొట్టవలస

తక్షణమే నష్టపరిహారం అందించాలి..

కొందరి రైతుల భూముల్లో వంశధార కుడి ప్రధాన కాలువను తవ్వారు. దీంతో భూములు కోల్పోయి ఆ కుటుంబాలు రోడ్డునపడ్డాయి. రైతులకు తక్షణమే నష్టపరిహారం అందించి ఆదుకోవాలి.

-తొత్తడి వైకుంఠరావు, విశ్రాంత ఉపాధ్యాయుడు, రొట్టవలస

న్యాయం చేయాలి..

తరతరాలుగా రైతులు ఈ భూములను నమ్ముకొని వారి కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఇవి ఇనాం భూములని రెవెన్యూ అధికారులు చెప్పడం అన్యాయం. తక్షణమే రాష్ట్రం ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించాలి.

-బెవర లక్ష్మణరావు, మండల తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి



ఇలాగేనా తీసుకెళ్లేది?

- ఆటో వెనుక భాగంలో కోడి మాంసం వేసి హోటళ్లకు తరలింపు

కాశీబుగ్గ ఎల్‌సీ గేటు వద్ద శుక్రవారం ఉదయం కనిపించిన చిత్రమిది. సాధారణంగా కోడి మాంసంతో పాటు ఏ ఇతర వస్తువులైనా ప్యాకింగ్ చేసి హోటళ్ల, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లకు తరలించడం సర్వ సాధారణం. కానీ, పలాస, కాశీబుగ్గ జంట పట్టణాల్లో మాత్రం కొన్ని హోటళ్లకు ఎటువంటి నిబంధనలు పాటించకుండా ఆటోల వెనుక భాగంలో చికెన్ ముక్కలు వేసుకొని తరలించడం పరిపాటిగా మారింది. నిత్యం రద్దీగా ఉండే రోడ్లపై వాటిని తరలిస్తుండడంతో దుమ్ము ధూళి మొత్తం అంతా వాటిపై పడుతుంది. దీంతో వాటిని తినేవారు కోరి వ్యాధులు తెచ్చుకున్నట్లే అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీనిపై మున్సిపల్ పారిశుధ్య, ఆహార నియంత్రణ విభాగం అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

-పలాస

ఒత్తిడిని భరించలేక..

- వైద్య విద్యార్థిని అదృశ్యం
- విశాఖ వెళ్లి తీసుకొచ్చిన తల్లిదండ్రులు

శ్రీకాకుళం క్రైం, ఆగస్టు 9: పరీక్షల ఒత్తిడిని భరించలేక ఓ వైద్య విద్యార్థిని కళాశాల నుంచి అదృశ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విశాఖపట్నంలో ఆమె ఉందని తెలుసుకున్న తల్లిదండ్రులు అక్కడకు వెళ్లి కుమార్తెను తిరిగి ఇంటికి తీసుకొచ్చారు. ఈ ఘటన శ్రీకాకుళం ప్రభుత్వ వైద్య కళాశాలలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు, కళాశాల సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. శ్రీకాకుళంలోని ప్రభుత్వ వైద్యకళాశాలలో ఓ విద్యార్థిని ఫైనలియర్ చదువుతుంది. ఆదివారంపేటలో తన తల్లిదండ్రులతో పాటు ఉంటూ కళాశాలకు వెళ్లి వస్తుంటుంది. మరో మూడు నెలల్లో పరీక్షలు జరగనుండడంతో ఒత్తిడికి లోనైంది. దీన్ని భరించలేక గురువారం కళాశాలకు వచ్చిన ఆమె మధ్యాహ్నం ఎవరికీ చెప్పకుండా తన ద్విచక్ర వాహనంపై బయటకు వెళ్లిపోయింది. రెండు గంటల తరువాత తన తల్లికి ఫోన్ చేసి తాను ఒత్తిడికి లోనయ్యానని, కళాశాల నుంచి బయటకు వచ్చేశానని, ఏం చేయాలో అర్థం కావడం లేదంటూ చెప్పి ఫోన్ కట్ చేసేసింది. దీంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న కళాశాల ప్రిన్సిపాల్ రెండో పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. సీఐ జి.ఉమామహేశ్వరరావు కళాశాలకు వెళ్లి ఆరా తీశారు. విద్యార్థిని ఫోన్ నెంబర్‌ను ట్రాక్ చేయడంతో పాటు కళాశాలలో ఉన్న సీసీ కెమెరాలు పరిశీలించారు. ఇదే సమయంలో ఆ విద్యార్థిని తల్లిదండ్రులకు మళ్లీ ఫోన్ చేసి తాను విశాఖలోని ఓ షాపింగ్ మాల్‌లో ఉన్నట్టు చెప్పింది. దీంతో తల్లిదండ్రులు అక్కడకు వెళ్లి కుమార్తెను తిరిగి ఇంటికి తీసుకొచ్చారు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. దీనిపై రిమ్స్ సూపరింటెండెంట్ షకీల వివరణ కోరగా.. 'ఒత్తిడి తట్టుకోలేక వాతావరణంలో మార్పు కోసం విద్యార్థిని బయటకు వెళ్లింది. ఎటువంటి అఘాయిత్యం చేసుకోలేదు. తిరిగి ఇంటికి వచ్చేసింది.' అని తెలిపారు.

పని చేయకుంటే తప్పుకోండి

- విధులపై ఇంత నిర్లక్ష్యమా?
- పనితీరు మార్చుకోకపోతే వేటు తప్పదు
- అధికారులపై కలెక్టర్ ఆగ్రహం
- మెట్టవలసలో పర్యటన



డీపీవో, పలుశాఖల అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కలెక్టర్

జి.సిగడాం, ఆగస్టు 9: మండలంలోని మెట్టవలస గ్రామంలో శుక్రవారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పర్యటించారు. డయేరియా రోగుల ఇళ్లకు వెళ్లి వారితో మాట్లాడారు. ప్రతీ వీధిలో పారిశుధ్యాన్ని పరిశీలించారు. పలుచోట్ల అపరిశుభ్రత నెలకొనడంతో అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధులపై ఇంత నిర్లక్ష్యమా అని మండిపడ్డారు. పని చేయడం ఇష్టం లేకపోతే స్వచ్ఛందంగా తప్పుకోవాలన్నారు. 'గ్రామంలో డయేరియా ప్రబలి రోజులు గడుస్తున్నా పారిశుధ్యాన్ని ఎందుకు మెరుగుపరచలేదు. ప్రజలు ప్రాణాలు కోల్పోయే వరకు పట్టించుకోరా. ప్రభుత్వం ద్వారా జీతం తీసుకోవటం లేదా, బాధ్యతగా పనిచేయాలనే జ్ఞానం లేదా. విధులంటే అంత నిర్లక్ష్యంగా ఉందా?. మీ అందరినీ విధుల నుంచి తొలగించినా తప్పులేదు. ఉద్యోగమంటే ఆటలాగ ఉందా? ఇప్పటికైనా పనితీరు మార్చుకొని బాధ్యతగా వ్యవహరించండి. మరలా నేను వచ్చేసరికి ఇదే పద్ధతి కనిపిస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదు. అలసత్వం వహించిన అధికారులపై వేటు తప్పదు. మీకు చేతకాకపోతే వేరే చోటనుంచి పంచాయతీ అధికారులను తెప్పించి పనులు చేయించుకుంటాం. మీరు ఇంటికి వెళ్లిపోవచ్చు' అని కలెక్టర్ హెచ్చరించారు. గ్రామ సమీపంలో ఉన్న కోళ్ల ఫారం నుంచి దుర్వాసన వస్తుందని, దీంతో తరచూ వ్యాధుల బారిన పడుతున్నామని పలువురు గ్రామస్థులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆ కోళ్ల ఫారానికి రూ.5 లక్షలు వరకూ అపరాధం వేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రజలు వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని సూచించారు. ఆయన వెంట డీఎంహెచ్‌వో బోడేపల్లి మీనాక్షి, డీపీవో వెంకటేశ్వరరావు, ఎంపీడీవో కె.వెంకన్నబాబు, వైద్యాధికారి యశ్వంత్, ఈవోపీఆర్డీ శ్రీనివాసులు, సర్పంచ్ కామోజుల అరుద్ర, ఎంపీటీసీ సభ్యురాలు బెవర లక్ష్మి, తదితరులు ఉన్నారు.

ఉద్యానవన పంటలకు అధిక ప్రోత్సాహం..

కలెక్టరేట్, ఆగస్టు 9: ఉద్యాన పంటలకు ప్రభుత్వం అధిక ప్రోత్సాహం అందిస్తుందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. శుక్రవారం జిల్లా ఉద్యానవనశాఖాధికారి ప్రసాదరావుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. '2021-23 మధ్య జిల్లాలో ఉద్యానవన శాఖకు నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా రైతులకు చెల్లించాల్సిన ఆర్థిక సహాయాన్ని వారి బ్యాంకు ఖాతాలకు జమ చేస్తున్నాం. 1,430 హెక్టార్లలో నాటేందుకు పూర్తి రాయితీపై రైతులకు ఆయిల్ పామ్ మొక్కలను అందించాం. 814 హెక్టార్లలో ఆయిల్ పామ్ సాగుకు ఎరువుల నిమిత్తం వారి బ్యాంకు అకౌంట్లకు పీఎఫ్ఎంఎస్ ద్వారా నగదు జమ చేస్తున్నాం. ఇప్పటివరకు రూ.28.33 లక్షలు జమ చేశాం. అలాగే మామిడి, జీడిమామిడి, జామ, డ్రాగన్‌ఫ్రూట్, ప్లాస్టిక్ మల్చింగ్, కోకో, సంకరజాతి కూరగాయల సాగు కోసం రైతులకు రూ.86.67లక్షల సబ్సిడీ ఇచ్చేందుకు నిధులు విడుదల చేస్తాం. జిల్లా వ్యాప్తంగా 29 పంటల సేకరణ కేంద్రాల నిర్మాణానికి రూ.2.25కోట్లు రైతు సంఘాల ఖాతాల్లో ఇప్పటికే జమ చేశాం. ఇప్పుడు మరో రూ.95 లక్షలు ఇచ్చాం. తొమ్మిది శీతల గదుల నిర్మాణానికి రూ.9.37 లక్షల చొప్పున మొత్తం రూ.59.37లక్షలు అందించాం. మరో విడతలో రూ.25 లక్షలు విడుదల చేస్తామని' కలెక్టర్ తెలిపారు.

మహిళలను సాంకేతిక విద్యలో ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన 'ప్రగతి స్కాలర్‌షిప్ స్కీమ్' నోటిఫికేషన్ వెలువడింది. 'ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ)' ఏటా దీనిని ఆఫర్ చేస్తోంది. ఈ స్కీమ్ ద్వారా డిప్లొమా, డిగ్రీ కేటగిరీల్లో అర్హులైన అమ్మాయిలకు ఆర్థిక సహకారం అందిస్తారు. ఒక కుటుంబం నుంచి ఇద్దరు అమ్మాయిలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. కుటుంబ వార్షికాదాయం రూ.8 లక్షలకు మించకూడదు. అకడమిక్ మెరిట్ ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.



ఏఐసీటీఈ
ప్రగతి స్కాలర్‌షిప్ స్కీమ్

తెలుగు రాష్ట్రాల్లో స్కాలర్‌షిప్‌లు

- డిప్లొమా, డిగ్రీ కేటగిరీల్లో ఒక్కోదానికి 5,000 చొప్పున దేశవ్యాప్తంగా మొత్తం 10,000 స్కాలర్‌షిప్‌లు అందుబాటులో ఉన్నాయి. వీటికి అదనంగా నిర్దేశిత కేంద్ర పాలిత ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి దరఖాస్తు చేసుకొన్న విద్యార్థినులందరికీ స్కాలర్‌షిప్ సౌకర్యం కల్పిస్తారు.
- డిప్లొమా కేటగిరీలో ఆంధ్రప్రదేశ్‌కు 318, తెలంగాణకు 206 స్కాలర్‌షిప్‌లు కేటాయించారు.
- డిగ్రీ కేటగిరీలో ఆంధ్రప్రదేశ్‌కు 566, తెలంగాణకు 424 స్కాలర్‌షిప్‌లు ప్రత్యేకించారు.

అర్హత వివరాలు

- డిప్లొమా కేటగిరీకి అప్లయ్ చేసుకోవాలంటే గుర్తింపు పొందిన పాఠశాల నుంచి పదోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. ఈ విద్యా సంవత్సరానికి టెక్నికల్ డిప్లొమా లెవెల్ కోర్సుల్లో ప్రవేశం పొంది ఉండాలి. లేటరల్ ఎంట్రీ ద్వారా డిప్లొమా ద్వితీయ సంవత్సరంలో చేరినవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- డిగ్రీ కేటగిరీకి దరఖాస్తు చేసుకోవాలంటే గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. ఏదేని టెక్నికల్ డిగ్రీ కోర్సులో ప్రవేశం పొంది ఉండాలి. లేటరల్ ఎంట్రీ ద్వారా రెండో సంవత్సరంలో ప్రవేశం పొందినవారు కూడా అర్హులే.
- పదోతరగతి/ఇంటర్ పూర్తిచేసిన రెండేళ్లలోపు ఏఐసీటీఈ గుర్తింపు పొందిన సంస్థలో డిప్లొమా/డిగ్రీ ప్రవేశం పొంది ఉండాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఇతర మెరిట్ స్కాలర్‌షిప్స్ పొందుతున్నవారు, పీఎంఎస్ఎస్ఎస్ స్కీం కింద చదువుకుంటున్నవారు, నాన్ టెక్నికల్ కోర్సుల్లో చేరినవారు, డ్యూయెల్ డిగ్రీ/పీజీ కోర్సుల్లో ప్రవేశం పొందినవారు, ఇతరత్రా స్టయిపెండ్/ఆదాయం పొందుతున్నవారు దరఖాస్తుకు అనర్హులు.

స్కాలర్‌షిప్

- టెక్నికల్ డిప్లొమా రెగ్యులర్ కోర్సులో చేరినవారికి మూడేళ్లు, లేటరల్ ఎంట్రీ అభ్యర్థులకు రెండేళ్లు; టెక్నికల్ డిగ్రీ రెగ్యులర్ కోర్సులో చేరినవారికి నాలుగేళ్లు, లేటరల్ ఎంట్రీ అభ్యర్థులకు మూడేళ్లపాటు స్కాలర్‌షిప్ అందిస్తారు. కాలేజ్ ఫీజు, కంప్యూటర్ కొనుగోలు, సాఫ్ట్‌వేర్, స్టేషనరీ, బుక్స్, ఎక్విప్‌మెంట్ తదితరాల నిమిత్తం ఏడాదికి రూ.50,000లు ఇస్తారు. డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్(డీబీటీ) విధానంలో నేరుగా అమ్మాయి బ్యాంక్ ఖాతాకు ఈ మొత్తాన్ని జమ చేస్తారు.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 31
- **దరఖాస్తుకు జతచేయాల్సిన పత్రాలు:** పదోతరగతి/ఇంటర్ సర్టిఫికెట్‌లు, మార్కుల పత్రాలు; ఆదాయ ధ్రువీకరణ పత్రం; సంబంధిత కోర్సులో అడ్మిషన్ పొందిన లెటర్; ట్యూషన్ ఫీజు రిసీట్; ఆధార్ లింక్‌తో ఉన్న బ్యాంక్ ఖాతా నంబర్; ఐఎఫ్ఎస్‌సీ కోడ్; కుల ధ్రువీకరణ పత్రం; ఆధార్ కార్డ్; అభ్యర్థి ఫొటో
- **ఇన్‌స్టిట్యూట్ వెరిఫికేషన్‌కు చివరి తేదీ:** నవంబరు 15
- **డీఎన్ఓ/ఎస్ఎన్ఓ/ఎంఎన్ఓ వెరిఫికేషన్‌కు చివరి తేదీ:** నవంబరు 30
- **వెబ్‌సైట్:** scholarships.gov.in

దిక్సూచి
DIKSUCHI

జేఎన్‌టీయూహెచ్‌లో స్పాట్ అడ్మిషన్స్



హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూ)కి చెందిన డైరెక్టరేట్ ఆఫ్ యూనివర్సిటీ ఫారిన్ రిలేషన్స్(డీయూఎఫ్ఆర్)- డిగ్రీ ప్రోగ్రామ్‌లలో విదేశీ కోటా కింద మిగిలిన సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్స్ నిర్వహిస్తోంది. ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్‌డ్ పద్ధతిలో సీట్లు అలాట్ చేస్తారు. ఎఫ్ఎన్/పీఐఓ/సీఐడబ్ల్యూజీ/ఎన్ఆర్ఐ కేటగిరీల అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. ఆసక్తిగలవారు ఒరిజినల్ సర్టిఫికెట్లు, నిర్దేశిత ఫీజులతో క్యాంపస్‌కు హాజరు కావాలి.

నాలుగేళ్ల బీటెక్ విభాగాలు-సీట్లు

- సీఎస్ఈ-ఏఐఎంఎల్ 6, సీఎస్ఈ-సైబర్ సెక్యూరిటీ 5, ఈసీఈ 4, ఈఈఈ 6, మెకానికల్ 6, సివిల్ 6, కెమికల్ 6, మెటలర్జీ 8, బయోటెక్నాలజీ 6, జియో ఇన్ఫర్మాటిక్స్ 8 సీట్లు చొప్పున మొత్తం 61 సీట్లు ఉన్నాయి.

అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ బీటెక్ విభాగాలు-సీట్లు

- సీఎస్ఈ, ఈసీఈ, ఈఈఈ, మెకానికల్, సివిల్ విభాగాల్లో ఒక్కోదానిలో 5 సీట్లు చొప్పున మొత్తం 25 సీట్లు ఉన్నాయి.

మూడేళ్ల మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్-సీట్లు

- బీబీఏ ప్రోగ్రామ్‌లో 6 సీట్లు ఉన్నాయి.
- **స్పాట్ అడ్మిషన్స్:** ఆగస్టు 12 నుంచి
- **వేదిక:** డైరెక్టరేట్ ఆఫ్ యూనివర్సిటీ ఫారిన్ రిలేషన్స్, జేఎన్‌టీయూహెచ్, కూకట్‌పల్లి, హైదరాబాద్
- **వెబ్‌సైట్:** www.jntuh.ac.in

ఫిల్మ్ డైరెక్షన్‌లో ఆన్‌లైన్ కోర్సు

పుణెలోని ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌టీఐఐ) ఆధ్వర్యంలోని సెంటర్ ఫర్ ఓపెన్ లెర్నింగ్(సీఎఫ్ఓఎల్)- 'ఫండమెంటల్స్ ఆఫ్ ఫిల్మ్ డైరెక్షన్' కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. మొత్తం 33 సీట్లు ఉన్నాయి.

కోర్సు వివరాలు: కోర్సు వ్యవధి అయిదు రోజులు. ఆగస్టు 26 నుంచి కోర్సు ప్రారంభమౌతుంది. ప్రతి రోజూ ఉదయం పదిన్నర నుంచి మధ్యాహ్నం పన్నెండున్నర వరకు, మరల మధ్యాహ్నం రెండున్నర నుంచి సాయంత్రం నాలుగున్నర వరకు సెషన్స్ ఉంటాయి. ఆంగ్ల మాధ్యమంలో తరగతులు నిర్వహించినప్పటికీ హిందీ మాధ్యమంలోనూ వివరణ ఇస్తారు. ఈ కోర్సులో సినిమా, లాంగ్వేజ్ ఆఫ్ సినిమా, స్పేస్ అండ్ టైమ్ ఆఫ్ సినిమా, ఫిల్మ్ ఫోరం, ఫిల్మ్ ఇమేజ్, ఫిల్మ్ సౌండ్, ఎలిమెంట్స్ ఆఫ్ స్టోరీ, స్క్రీన్‌ప్లే, వర్కింగ్ విత్ యాక్టర్స్, రోల్ ఆఫ్ ఫిల్మ్ డైరెక్టర్ తదితర అంశాలు వివరిస్తారు.

అర్హత: పదోతరగతి/పన్నెండో తరగతి ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు 2024 ఆగస్టు 1 నాటికి 18 ఏళ్లు నిండి ఉండాలి. అభ్యర్థులు కనీసం 4 జీబీ ర్యామ్ గల డెస్క్‌టాప్/ల్యాప్‌టాప్, విండోస్ 7/8/10 ఆపరేటింగ్ సిస్టమ్, ఆడియో-వీడియో సాఫ్ట్‌వేర్, హెడ్‌ఫోన్/ఇయర్‌ఫోన్, హెచ్‌డీ వెబ్ క్యామ్, రోజుకి కనీసం 5 జీబీ ఇంటర్నెట్ ప్యాక్, లేటెస్ట్ వెబ్ బ్రౌజర్ ఏర్పాటు చేసుకోవాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 12
- **వెబ్‌సైట్:** ftii.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/GABEQtfలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి



మురారి చూస్తూ మూడుముళ్లు

అభిమాన హీరో సినిమా రిలీజ్ అవుతోందంటే క్షీరాభిషేకాలు, హారతులు, తీన్‌మార్ డప్పుల మోతలతో ఫ్యాన్స్ సందడి చేయడం తెలిసిందే. ఇప్పుడు మహేశ్‌బాబు అభిమానులు మరో అడుగు ముందుకేశారు. శుక్రవారం ఆయన నటించిన 'మురారి' చిత్రం రీ రిలీజ్ అయింది. ఈ సందర్భంగా కొందరు అభిమానులు థియేటర్లలో ప్రేక్షకులకు అక్షింతలు పంచగా, మరికొందరు థియేటర్లలోనే పెళ్లి చేసుకొన్నారు. ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. తెలుగు సినిమాల్లో పెళ్లి పాటల ప్రస్తావన తెస్తే అందులో 'మురారి' చిత్రంలోని 'అలనాటి రామచంద్రుడు' గీతం తప్పకుండా ఉంటుంది. అందుకేనేమో 'మురారి' సినిమా రీ రిలీజ్‌ను తమ పెళ్లికి వేదికగా చేసుకున్నారు మహేశ్‌బాబు అభిమానులు. 'అలనాటి రామచంద్రుడు' గీతం తెరపై ప్లే అవుతోన్న సమయంలో తన ప్రియురాలు మెడలో మూడు ముళ్లు వేశాడు ఓ యువకుడు. మరికొన్ని థియేటర్లలో అభిమానులు ప్రేక్షకులకు అక్షింతలు పంచారు. మహేశ్‌బాబు, సోనాలి బింద్రే పెళ్లి సీన్ రాగానే వాటిని తెరపైకి విసురుతూ వారంతా సందడి చేస్తున్న వీడియోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. కృష్ణవంశీ దర్శకత్వం వహించిన 'మురారి' చిత్రం 2001లో విడుదలై ఘన విజయం అందుకొంది.

షూటింగ్ షురూ



అభిమానులంతా ఎప్పుడెప్పుడు షూటింగ్ మొదలవుతుందా అని ఎదురుచూస్తున్న క్రేజీ ప్రాజెక్ట్‌లో డైరెక్టర్ ప్రశాంత్ నీల్, జూనియర్ ఎన్టీఆర్ సినిమా ఒకటి. 'ఎన్టీఆర్ నీల్' వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కనున్న ఈ సినిమాను శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్, డైరెక్టర్ నీల్ కుటుంబ సభ్యులతో పాటు పలువురు సినీ ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేకర్స్ మాట్లాడుతూ "ఈ సినిమాపై ఎన్ని అంచనాలు ఉన్నాయో తెలిసిందే. ఆ అంచనాలను మించి ఈ సినిమా ఉంటుంది. ఓ వైవిధ్యమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ను అందిస్తుంది" చెప్పారు. పాన్ ఇండియా ప్రాజెక్టుగా తెరకెక్కనున్న ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, హరికృష్ణ కొసరాజు నిర్మిస్తున్న ఈ సినిమా 2026 జనవరి 9న విడుదల కానుంది.



బచ్చన్ అలరిస్తాడు

'మిస్టర్ బచ్చన్' సినిమాతో కథానాయికగా తెలుగుతెరకు పరిచయమౌతున్నారు భాగ్యశ్రీ బోర్సే. ఇప్పటికే రిలీజైన టీజర్, ట్రైలర్‌లో తన అందం, అభినయంతో కుర్రకారు మనసును దోచేసిన ఆమె.. ఈ నెల 15న సినిమా విడుదలవుతున్న సందర్భంగా మీడియాతో ముచ్చటించారు. "ఇందులో నేను పోషించిన పాత్ర పేరు జిక్కీ. సినిమాలో నా పాత్ర చాలా కీలకమైనది. దర్శకుడు హరీశ్ శంకర్ ఈ కథ చెప్పగానే నచ్చేసింది. నా పాత్రకు నేనే డబ్బింగ్ చెప్పాను. అంచనాలను మించేలా దర్శకుడు ఈ సినిమాను అద్భుతంగా తెరకెక్కించారు. ఇది బాలీవుడ్ సినిమా 'రైడ్'కు రీమేక్‌గా తెరకెక్కినా ఇందులో వినోదం, ప్రేమకథ అదనంగా ఉంటాయి. రవితేజ లాంటి అగ్ర నటుడితో కలసి నటించడం చాలా మధురానుభూతి. మిక్కీ.జే. మేయర్ సంగీతం ఈ సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లింది. థియేటర్లో ప్రతి క్షణం ఎంజాయ్ చేసే సినిమా ఇది" అని చెప్పారు.

సూర్యకు స్వల్ప గాయం



తమిళ హీరో సూర్య స్వల్పంగా గాయపడ్డారు. ఆయన తాజాగా నటిస్తున్న చిత్రం షూటింగ్‌లో ఈ ప్రమాదం జరిగింది. అభిమానులు ఆందోళన చెందడంతో సూర్య స్నేహితుడు, సహ నిర్మాత రాజశేఖర్ పాండ్యన్ తన ఎక్స్ ఖాతాలో ఓ ట్వీట్ చేశారు. 'ప్రియమైన అభిమానులారా.. ఇది కేవలం చిన్న గాయం మాత్రమే. దయచేసి ఎవరూ ఆందోళన చెందకండి. మీ అందరి ఆదరాభిమానాలు, ప్రేమ, ప్రార్థనలతో సూర్య బాగానే ఉన్నారు' అని పేర్కొన్నారు. కాగా, 'కంగువా' సినిమా తర్వాత కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో 'సూర్య44' అనే వర్కింగ్ టైటిల్‌తో ఈ కొత్త చిత్రం తెరకెక్కుతోంది. ఊటీలో రెండో షెడ్యూల్ షూటింగ్ జూలై 26 నుంచి శరవేగంగా సాగుతోంది. ఇందులో భాగంగా 'నవానగర్ ప్యాలెస్'లో జూనియర్ ఫైటర్లతో కలిసి పోరాట సన్నివేశాన్ని చిత్రీకరిస్తుండగా, సూర్య తలకు స్వల్ప గాయమైంది. ఆ వెంటనే ఆయన్ని సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. ఈ ఘటన కారణంగా షూటింగ్ నిలిపివేశారు. చికిత్స అనంతరం సూర్య మళ్లీ లొకేషన్‌కు వచ్చి షూటింగ్‌లో పాల్గొన్నారు.

చెన్నై, (ఆంధ్రజ్యోతి)

కీలక షెడ్యూల్‌లో...



తమిళ స్టార్ హీరో అజిత్‌కుమార్ నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. తెలుగు-తమిళ భాషల్లో తెరకెక్కుతున్న ఈ బైలింగువల్ చిత్రానికి 'మార్క్ ఆంటోని' ఫేమ్ అధిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో నవీన్ యెర్నేని, వై రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఇటీవలే విడుదలైన ఫస్ట్ లుక్ అందరినీ ఆకట్టుకుంది. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన కీలక షెడ్యూల్ హైదరాబాద్‌లో జరుగుతోంది. సంక్రాంతి కానుకగా 2025లో చిత్రం విడుదలవుతోంది.

కొత్తగా...

నిరీక్షణకు తెర



'కేజీఎఫ్' తర్వాత యశ్ ఏ సినిమా చేస్తారా అని ఎదురు చూస్తున్న అభిమానుల నిరీక్షణకు తెర పడింది. ఆయన హీరోగా నటించే పాన్ ఇండియా మూవీ 'టాక్సిక్.. ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్' చిత్రం షూటింగ్ బెంగళూరులో పూజా కార్యక్రమాలతో మొదలైంది. యశ్ పుట్టిన రోజున ప్రారంభమైన ఈ చిత్రానికి గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహిస్తున్నారు. పవర్‌ఫుల్ కథతో, ఎమోషనల్ సీన్స్‌తో విజువల్‌గా ఉన్నతంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తామని నిర్మాత వెంకట్ కె నారాయణ చెప్పారు.

నిర్మాతగా మారిన దర్శకుడు



సీనియర్ దర్శకుడు ముత్యాల సుబ్బయ్య సమర్పణలో ఆయన తనయుడు ముత్యాల అనంత కిశోర్ నిర్మించే 'తల్లి మనసు' చిత్రం షూటింగ్ శుక్రవారం ఉదయం అన్నపూర్ణ స్టూడియోలో మొదలైంది. ముహూర్తపు షాట్‌కు ఏషియన్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ భరత్ నారంగ్ కెమెరా స్విచ్ ఆన్ చేయగా, సీనియర్ నిర్మాత పోకూరి బాబూరావు తొలి క్లాప్ ఇచ్చారు. 'టైటిల్‌ను బట్టి చూస్తేనే ఇది ఎంత మంచి సబ్జెక్టో మీకు అర్థమవుతుంది' అన్నారు ముత్యాల సుబ్బయ్య. ఓ మధ్యతరగతి తల్లి చుట్టూ తిరిగే కుటుంబ కథా చిత్రమిదని దర్శకుడు శ్రీనివాస్ చెప్పారు.

కర్ణాటక నాటక అకాడమీ పురస్కారాన్ని తిరస్కరించిన ప్రకాశ్‌రాజ్



కర్ణాటక నాటక అకాడమీ వార్షిక పురస్కారాన్ని విలక్షణ నటుడు ప్రకాశ్‌రాజ్ తిరస్కరించారు. ఈ మేరకు 'ఎక్స్'లో శుక్రవారం పోస్ట్ చేశారు. అభిమానులు, అకాడమీని క్షమాపణలు కోరారు. పురస్కారాన్ని తీసుకునేందుకు తన మనస్సాక్షి అంగీకరించడం లేదని, క్షమించాలని అన్నారు. ఇప్పుడిప్పుడే నాటకరంగంవైపు వెనుతిరిగానని, చేయాల్సిన పనులు ఎక్కువే ఉన్నాయని పేర్కొన్నారు. తనకంటే ఎంతో మంది అర్హులు రంగస్థలంలో ఉన్నారని, అందుకే తన మనస్సాక్షి అంగీకరించడం లేదని, పురస్కారాన్ని తిరస్కరించానని తెలిపారు.

బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

నేనా.. సింగిలా..!



కీర్తి సురేశ్ నటించిన తమిళ చిత్రం 'రఘుతాత'. ఈ నెల 15న సినిమా విడుదలవుతోంది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో ఉన్న ఆమె.. ఓ పాడ్‌కాస్ట్‌లో ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. "ప్రస్తుతం నా కెరీర్‌ను ఎంతో బాగా ఆస్వాదిస్తున్నాను. నా దృష్టిలో పెళ్లి అంటే ఇద్దరు వ్యక్తులు ఒకరికొకరు గౌరవం ఇచ్చుకుంటూ జీవితాంతం కొనసాగడమే" అని పేర్కొన్నారు. ఓ విలేఖరి మీరు సింగిలా అని ఆమెని అడగ్గా.. "నేను మీకెప్పుడు సింగిల్ అని చెప్పలేదు కదా" అని బదులిచ్చారు. దీంతో ఆమె రిలేషన్‌షిప్‌లో ఉన్నారంటూ వస్తున్న వార్తలు నిజమేనేమో అని అభిమానులు భావిస్తున్నారు.

దుబాయ్‌లో అమ్మేస్తాడేమో...

తాప్సీ పన్ను నటించిన 'ఖేల్ ఖేల్ మే' ఈ నెల 15న విడుదలవుతోంది. ఈ చిత్ర ప్రమోషన్స్‌లో భాగంగా ఆమె మీడియాతో ముచ్చటించి ఓ ఆసక్తికర విషయాన్ని తెలియజేశారు. "నేను, నా భర్త మథియస్ బో 2013లో మొదటిసారి కలుసుకున్నాం. మొదటి సారి తనతో డేటింగ్‌కు వెళ్లాల్సినప్పుడు నన్ను దుబాయ్ రమ్మని మథియస్ ఆహ్వానించాడు. ఆ విషయం నా మిత్రురాలికి చెబితే.. జాగ్రత్త.. ఆయన నిన్ను దుబాయ్‌లో అమ్మేస్తాడేమో.. ఎందుకైనా మంచిది.. మా అక్క నంబర్ తీసుకో" అని ఓ స్నేహితురాలు చెప్పిన విషయాన్ని ఆమె గుర్తుచేసుకున్నారు.



ఎన్టీఆర్ మునిమనవడితో



నందమూరి హరికృష్ణ, బాలకృష్ణలతో సినిమాలు రూపొందించిన దర్శకుడు, సీనియర్ ఎన్టీఆర్ వీరాభిమాని అయిన వై.వి.ఎస్. చౌదరి తాజాగా ఓ చిత్రాన్ని రూపొందించనున్నారు. న్యూ టాలెంట్ రోర్స్ (ఎన్.టి.ఆర్.)పతాకంపై ఆయన సతీమణి గీత ఈ సినిమాను నిర్మించనున్నారు. సీనియర్ ఎన్టీఆర్ ముని మనవడు, హరికృష్ణ మనవడు నందమూరి తారక రామారావు ఈ చిత్రంతో హీరోగా పరిచయమవుతున్నారు. అలాగే తెలుగు అమ్మాయి వీణా రావుని హీరోయిన్‌గా పరిచయం చేస్తున్నట్లు శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో వై.వి.ఎస్. చౌదరి చెప్పారు.

సుప్రీం కోర్టులో లాపతా లేడీస్ ప్రదర్శన

బాలీవుడ్ చిత్రం 'లాపతా లేడీస్'కు అరుదైన గౌరవం దక్కింది. దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు చరిత్రలో తొలిసారి ప్రదర్శించిన సినిమాగా చరిత్ర సృష్టించింది. సుప్రీం కోర్టు వజ్రోత్సవాలను పురస్కరించుకొని 'లాపతా లేడీస్'ను శుక్రవారం సాయంత్రం కోర్టు ఆడిటోరియంలో ప్రత్యేకంగా ప్రదర్శించారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్‌తో పాటు ఇతర న్యాయమూర్తులు, న్యాయస్థానం సిబ్బంది వారి కుటుంబ సభ్యులతో కలసి ఈ చిత్రాన్ని వీక్షించారు. తన సొంత ప్రొడక్షన్‌లో ఆమిర్‌ఖాన్ ఈ చిత్రాన్ని నిర్మించగా, ఆయన మాజీ భార్య కిరణ్‌రావు దర్శకత్వం వహించారు. వారిద్దరూ ఈ ప్రదర్శనకు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. లింగ సమానత్వం నేపథ్యంలో తెరకెక్కిన 'లాపతా లేడీస్' చిత్రం ఈ ఏడాది మార్చిలో విడుదలైంది. కమర్షియల్‌గా విజయం సాధించకపోయినా, విమర్శకుల ప్రశంసలతో పాటు పలు పురస్కారాలు అందుకుంది.

ప్రేమకథను ప్రశంసిస్తున్నారు



విజయ్‌శంకర్ హీరోగా నటించిన 'పాగల్ వర్సెస్ కాదల్' చిత్రం శుక్రవారం సినిమా విడుదలై మంచి టాక్‌తో దూసుకుపోతోంది. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ "డైరెక్టర్ ఈ కథ చెప్పినప్పుడు చాలా కొత్తగా అనిపించింది. కథకు అందరూ కనెక్ట్ అయ్యారు. ప్రేమకథ కొత్తగా ఉందని ప్రేక్షకులు ప్రశంసిస్తున్నారు. ఈ సినిమా విజయం సాధించడంతో ఎంతో ఆనందంగా ఉంది. యూత్, ఫ్యామిలీ.. ఇలా అన్ని వర్గాలకు చెందిన ప్రేక్షకులు సినిమాను ఆదరిస్తున్నారు" అని చెప్పారు.

ప్రణయ గాథ



ఎస్.ఎస్. సైదులు, భ్రమరాంబిక, అర్పిత లోహి ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న చిత్రం '1980ల రాధేకృష్ణ'. ఇస్మాయిల్ షేక్ దర్శకత్వంలో ఊడుగు సుధాకర్ నిర్మిస్తున్నారు. శుక్రవారం ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు ఇస్మాయిల్ షేక్ మాట్లాడుతూ "ఇదో అద్భుతమైన ప్రేమ కథ. ఈ సినిమా ప్రేక్షకులను తప్పకుండా అలరిస్తుంది" అని చెప్పారు.

'డీల్' కుదిరిందా?



హీరో హను కోట్ల స్వీయ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'డీల్'. పద్మారమా కాంతారావు, కొల్వి రామకృష్ణ నిర్మిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమా పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా హను కోట్ల మాట్లాడుతూ "ఇదో డిఫరెంట్ కథతో వస్తున్న సినిమా. సస్పెన్స్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమా అందరినీ అలరిస్తుంది" అని తెలిపారు.

ఆలయాలకు శ్రావణ శోభ

- అమ్మవారి దర్శనానికి క్యూ కట్టిన భక్తులు
- దేవాలయాల్లో వెల్లివిరిసిన ఆధ్యాత్మికత
- ఘనంగా సామూహిక కుంకుమ పూజలు


పలాస: సీతారామాలయంలో లక్ష్మీదేవిని దర్శించుకునేందుకు క్యూ కట్టిన భక్తులు

శ్రావణమాసం మొదటి శుక్రవారం సందర్భంగా ఆలయాలకు శ్రావణ శోభ సంతరించుకుంది. తెల్లవారుజాము నుంచే భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పలు ఆలయాల్లో లక్ష్మీదేవికి అభిషేకాలు, విశేష అలంకరణలు చేశారు. అర్చకుల వేద మంత్రోచ్ఛారణల మధ్య అమ్మవారికి విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి.

-ఆంధ్రజ్యోతి బృందం


నరసన్నపేట: సంతోషిమాత ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు


టెక్కలి: సంతోషిమాత ఆలయంలో ..



కోటబొమ్మాళి: కొత్తపేట, జలుమూరు: వారాహి ఆలయంలో కుంకుమ పూజలు


ఇచ్ఛాపురం: స్వేచ్ఛావతి అమ్మ ఆలయంలో లలితా పారాయణం


శ్రీకాకుళం కల్చరల్: సంతోషిమాత గుడి వద్ద..


ఎచ్చెర్ల: దేవీ ఆశ్రమంలో శ్రీచక్రాలకు కుంకుమ పూజలు


శ్రీకాకుళం కల్చరల్: అలంకరణలో విజయదుర్గమ్మ


శ్రీకాకుళం కల్చరల్: అలంకరణలో సంతోషిమాత

ఎస్ఎంసీ ఎన్నికలకు విఘాతం కలిగించిన ఇద్దరిపై కేసు నమోదు

జలుమూరు: స్థానిక ప్రాథమిక పాఠశాలలో గురువారం నిర్వహించిన పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికల విధులకు ఆటంకం కలిగిస్తూ ఓటర్లను భయభ్రాంతులకు గురి చేశారని హెచ్ఎం మెండ రామారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.మధుసూదనరావు తెలిపారు. ఈ మేరకు జలుమూరు గ్రామానికి చెందిన ఇప్పిలి బాలకృష్ణ, కోన ఉమపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

గుజరాతీపేట: మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి పురస్కరించుకుని నిర్వహించనున్న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో ఎస్.తిరుమల చైతన్య శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 12 నుంచి 26వ తేదీలోగా దరఖాస్తులు అందించాలని కోరారు. అరులైన జిల్లా ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవచ్చునని, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లోని ఉపాధ్యాయులు ఎంఈవోల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, జిల్లాలో ఉన్నత పాఠశాలలోని ఉపాధ్యాయులు డిప్యూటీ డీఈవోల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. సెప్టెంబరు 5న ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందించనున్నామన్నారు.

పాఠశాలలకు స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ అవార్డు

శ్రీకాకుళం స్పోర్ట్స్: మాజీ హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 29న నిర్వహించనున్న జాతీయ క్రీడా దినోత్సవానికి పాఠశాలల నుంచి అవార్డుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు డీఈవో ఎస్.తిరుమల చైతన్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్స్‌లెన్సీ అవార్డు పేరిట 2023-24 సంవత్సరానికి గాను దరఖాస్తులను ఈనెల 16వ తేదీలోగా ఎస్‌జీఎఫ్ కార్యాలయానికి అందజేయాల్సిందిగా కోరారు.

సెలవు దినాల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు

గుజరాతీపేట: జిల్లాలో ప్రభుత్వ సెలవు దినాలైన రెండో శనివారం, ఆదివారాల్లో పాఠశాలల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు తప్పవని డీఈవో ఎస్.తిరుమల చైతన్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్ని యాజమాన్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు పాటించేలా డీఈవోలు, ఎంఈవోలు పర్యవేక్షించాలని ఆయన ఆ ప్రకటనలో సూచించారు.

జాతీయ సదస్సులో పలాస జీడి వ్యాపారికి గుర్తింపు

పలాస: బెంగుళూరు పట్టణంలో నిర్వహిస్తున్న జాతీయ కాష్యూ అసోసియేషన్ సదస్సులో పలాస జీడి వ్యాపారి మల్లా కాంతారావుకు అరుదైన గుర్తింపు లభించింది. ఈ సదస్సు గురువారం ప్రారంభం కాగా శనివారం వరకు నిర్వహిస్తున్నారు. పలాస పారిశ్రామికవాడలో జీడి పరిశ్రమ నెలకొల్పి అనేక మందికి జీవనభృతి కల్పిస్తున్న కాంతారావును జాతీయ స్థాయి డెలిగేట్‌గా ఈ సదస్సులో ఎంపిక చేసి అభినందించారు. ఈయన అంతర్జాతీయ కాష్యూ వ్యాపారులతో సత్సంబంధాలు కలిగి సభ్యులుగా వ్యవహరిస్తున్నారు. జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకున్న కాంతారావును పారిశ్రామిక వాడ జీడి పరిశ్రమల సంఘం నేతలు అభినందించారు.

ఓబీసీ ప్రక్రియ వేగవంతం చేయండి

కోటబొమ్మాళి/టెక్కలి: కళింగ కోమటి, సొండి, శిష్ట కరణ కులాలను ఓబీసీలో చేర్చే ప్రక్రియ వేగవంతం చేయాలని ఆయా సంఘాల నేతలు కోరారు. ఈ మేరకు వారంతా శుక్రవారం ఢిల్లీ లోని సింధూర బ్లాక్‌లో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును కలిసి వినతి పత్రాలు అందించారు. మా కులాలను ఓబీసీలో చేర్చి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో కళింగ కోమట్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోయిన గోవింద రాజులు, రాష్ట్ర కార్యదర్శి కోరాడ శ్రీనివాసరావు, పట్నాన సాయికిరణ్, పీవీ రమణ, సొండి కుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శు లు రత్నాల కాశీవిశ్వనాథ్, సాహుకారి నాగేశ్వరరావు, శిష్టకరణ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పోలుమహంతి ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు. కళింగ కోమటి, సొండి, శిష్టకరణ కులాలను ఓబీసీలో చేర్చేందుకు తనవంతు కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

ఉపాధి మెటీరియల్ పనుల్లో అక్రమాలు తేలితే చర్యలు

ఎల్.ఎన్.పేట: ఉపాధిహామీలో భాగగా చేపట్టిన మెటీరియల్ పనుల్లో అక్రమాలు జరిగినట్లు గుర్తిస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని క్వాలిటీ కంట్రోల్ జిల్లా సీనియర్ పరిశీలకుడు వి.సతీష్ బాబు హెచ్చరించారు. ధనుకువాడ, బొత్తాడసింగి, యంబరాం, కొమ్ము వలస గ్రామాల్లో జరిగిన మెటీరియల్ పనులను శుక్రవారం పరిశీలించారు. క్వాలిటీ కంట్రోల్ పరిశీలకుడు కె.గోవింద రావు, ఏపీవో శ్రీదేవి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర నిర్ణయాలతో రైతులకు నష్టం

- 'క్విట్ కార్పొరేట్' నిరసనలో వక్తలు

టెక్కలి: కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లే పరిస్థితి నెలకొందని రైతు సంఘాల నేతలు అన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా, రైతు సంఘాల సమన్వయ సమితి పిలుపు మేరకు 'క్విట్ కార్పొ రేట్' పేరిట శుక్రవారం టెక్కలిలో రైతులు, రైతు సంఘ నాయకులు నిరసన తెలిపారు. స్థానిక సీఐటీయూ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి నిరసన వ్యక్తంచేశారు. కిసాన్ కాంగ్రెస్ నాయకుడు కోత మధుసూదనరావు మాట్లాడుతూ.. కేంద్ర నిర్ణయాల వల్ల భవిష్యత్‌లో ఎరువులు, పురుగుల మందుల ధరలు పెరుగుతాయన్నారు. రైతు సంఘ నాయకులు బి.వాసు దేవరావు, పి.సాంబమూర్తి, బి.మల్లయ్య పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నేతలు

క్విట్ కార్పొరేట్ పోరాటం సాగించాలి

కాశీబుగ్గ: క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో 'క్విట్ కార్పొరేట్' పోరాటం సాగించాలని పలు ప్రజా సంఘాల నాయకులు అన్నారు. శుక్రవారం సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో కాశీబుగ్గ పాత బస్టాండ్ గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు గణపతి, మాధవరావు, సన్యాసి రావు, రామారావు, అజయ్‌కుమార్, ఢిల్లేశ్వరి, కామేశ్వరరావు, వినోద్, బీమారావు, లోకనాథం, పలువురు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థిని ఆత్మహత్యపై న్యాయవిచారణ


విచారణ చేపడుతున్న న్యాయాధికారి సన్యాసినాయుడు

నందిగాం: స్థానిక డా.బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకులంలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థిని లిమ్మక అక్షిత(16) ఆత్మహత్య ఘటనపై శుక్రవారం న్యాయ విచారణ చేపట్టారు. జిల్లా డీఎల్ఎస్ఏ కార్యదర్శి, న్యాయాధి కారి ఆర్.సన్యాసి నాయుడు సమగ్ర దర్యాప్తు నిర్వహించారు. విద్యార్థిని కుటుంబ సభ్యులు, పాఠశాల సిబ్బంది, ఎస్ఐ మహమ్మద్ అమీర్ ఆలీ తదితరుల నుంచి వివరాలు సేకరించారు. ఈ విచారణలో జిల్లా గురుకులాల సమన్వయకర్త ఎస్.బాలాజీ నాయక్, గురుకులం సూపరింటెండెంట్ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ రాజ్యాంగాన్ని తెలుసుకోవాలి

మెళియాపుట్టి: ప్రతి ఒక్కరు భారత రాజ్యాంగాన్ని తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని టెక్కలి సీనియర్ సివిల్ న్యాయాధికారి జె.శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. అక్కడ భోజనాలు, వసతులపై విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కలిగించాలని సూచించారు. చెడు ప్రవర్తనకు దూరంగా సోదర భావంతో ఉండాలని కోరారు. విద్యాహక్కు చట్టంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ టి.రాజేష్, కేజీబీవీ ప్రిన్సిపాల్ రమ్య, పలువురు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజభాష హిందీని నేర్చుకోవాలి

ప్రియాగ్రహారం(పోలాకి): జాతీయ భాష, రాజభాషగా గుర్తింపబడిన హిందీని ప్రాథమిక స్థాయి నుంచి విద్యార్థులు నేర్చుకోవాలని ప్రియాగ్రహారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం బి.విశ్వేశ్వరరావు అన్నారు. పాఠశాల ప్రాంగ ణంలో హిందీ ప్రచారసభ, హైదరాబాద్ వారు నిర్వహించిన నాగరీ బోధ్, ప్రవే శ, మధ్యమ, ఉత్తమ, విశారద పరీక్షల యోగ్యతా పత్రాల పంపిణీ కార్యక్రమం శుక్రవారం చేపట్టారు. అనంతరం ఉత్తీర్ణులైన విద్యార్థులకు యోగ్యతా పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హిందీ పండితులు సుజాత, హిందీ కేంద్ర వ్యవస్థాపక్ పీవీఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

దేవళభద్రలో ఇండిగ్యాప్ పొలంబడి

నందిగాం: దేవళభద్రలో శుక్రవారం ఇండిగ్యాప్ పొలంబడి నిర్వహించారు వ్యవసాయాధికారి పి.శ్రీకాంత్ వర్మ మాట్లాడుతూ.. వరి చేనులో కాలిబాటలు ఏర్పాటు ద్వారా వేసుకోవడం ద్వారా గాలి, వెలుతురు ప్రవేశించి చీడపీడల నివారణ అవుతాయన్నారు. కార్యక్రమంలో విశ్రాంత డీసీసీబీ ఉద్యోగి ఎస్.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

కంటి వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలి

హరిపురం: విద్యార్థి దశనుంచి కంటి వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలని నేత్ర వైద్యాధికారి రోణంకి వెంకటరమణ అన్నారు. జీఆర్‌పురం హైస్కూల్‌లో శుక్రవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 197 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేసి 8 మందికి కళ్లద్దాలకు సిఫారసు చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం బి.వెంకటరావు, కె.లావణ్య, ఎస్.కాంతారావు, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

సీఐగా శ్రీనివాసరావు

నరసన్నపేట: నరసన్నపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. సర్కిల్ పరిధిలోని నాలుగు మండలాల్లో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ఇసుక అక్రమ రవాణ, పిక్కాట, గంజాయి అక్రమ రవాణాపై దృష్టి సారించడం జరుగుతుందన్నారు. బదిలీ అయిన సీఐ ప్రసాదరావు నుంచి బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను నాలుగు మండలాల ఎస్ఐలు అశోక్‌బాబు, వి.సత్యనారాయణ, కె.మధుసూదనరావు, జి.అప్పారావు మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు. సీఐ శ్రీనివాసరావు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, ఎస్పీ పరమేశ్వర్ రెడ్డిలను మర్యాద పూర్వకంగా కలిశారు.

ఆర్టీసీ బస్సు కిందపడి వృద్ధుడి ఆత్మహత్య


మురళీపాత్రో(ఫైల్)

పలాస: కాశీబుగ్గ పాత జాతీయరహదారి ఎల్‌సీ గేటు వద్ద శుక్రవారం ఉదయం ఆర్టీసీ బస్సు కిందపడి బ్రాహ్మణ వీధికి చెందిన మురళీ పాత్రో(62) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. శ్రీకాకుళం డిపోకు చెందిన బస్సు పలాస ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వస్తున్న సమయంలో రైల్వే గేటు వేయడంతో డ్రైవర్ గోపి బస్సును నిలుపుదల చేశారు. గేటు ఎత్తిన తరువాత బస్సు కదిలే సమయంలో మురళీపాత్రో వెనుక చక్రాల కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. పాత్రో కొన్నాళ్లపాటు బస్టాండ్ ఆవరణలో స్వీట్ షాపు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వ్యాపారం కలిసి రాకపోవడంతో స్వీట్లు తయారుచేసి దుకాణాలకు విక్రయించే వ్యాపారం ప్రారంభించాడు. ఈ సమయంలో ఆయన ఆత్మహత్యకు పాల్పడడంతో కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. ఘటనా స్థలాన్ని కాశీబుగ్గ ఎస్ఐ పారినాయుడు, సిబ్బంది చేరుకుని పరిశీలించారు. ఘటన తీరును ఆర్టీసీ డ్రైవర్‌ను అడిగి తెలుసుకున్నారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నవతల వద్ద రోడ్డు ప్రమాదం

● భర్త మృతి.. భార్యకు తీవ్రగాయాలు


బుచ్చిబాబు (ఫైల్)

సారవకోట(జలుమూరు)/ నరసన్నపేట: సారవకోట మండలం నవతల గ్రామం వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నరసన్నపేట మండలం జమ్ము పంచాయతీ పొన్నానపేటకు చెందిన పొన్నాన బుచ్చిబాబు (35) అక్కడక్కడే మృతిచెందగా.. భార్య మీనమ్మ తీవ్రంగా గాయపడింది. సారవకోట పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పొన్నానపేట నుంచి ఓ కార్యక్రమానికి రుగడ కొమనాపల్లి బైక్‌పై భార్య మీనమ్మతో బుచ్చిబాబు వెళ్లారు. తిరిగి వస్తుండగా నవతల గ్రామ సమీపానికి వచ్చే సరికి ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో బుచ్చిబాబు అక్కడికక్కడే మృతిచెందగా భార్య మీనమ్మకు ఎడమ కాలు విరగడంతో పాటు నడుమునకు బలమైన గాయాలయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ జి.అప్పారావు తెలిపారు. వీరికి ఇద్దరు కుమారులు, తండ్రి చిన్నబాబు ఉన్నారు. గ్రానైట్ ప్యాలీస్ ఫ్యాక్టరీలో పనిచేస్తూ కుటంబాన్ని పోషిస్తున్న బుచ్చిబాబు మృతితో ఆ కుటుంబం రోడ్డున పడింది.

బంధువుల ఆందోళన.. ట్రాఫిక్‌కు అంతరాయం


ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు

ఈ ప్రమాద సమయంలో జెమ్స్‌లో పనిచేస్తున్న ఓ మహిళా డాక్టర్ కారు నడుపుతున్నారని, అయితే పోలీసులు మాత్రం వేరొక వ్యక్తి నడిపినట్టు కేసు నమోదు చేయడంతో మృతుడి బంధువులు ఘటన ప్రాంతం వద్ద ధర్నా చేశారు. దీంతో రెండు వైపులా వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న సారవకోట పోలీసులు అక్కడికి చేరుకుని వారికి నచ్చజెప్పి బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామన్నారు. టోల్‌ప్లాజ్ వద్ద కారు నడిపే సమయంలో డ్రైవర్ సీటులో ఉన్న వ్యక్తి సీసీ ఫుటేజీలను పరిశీలించామని, అందుకే న్యాయం చేయాలని కోరుతున్నామని పొన్నానపేట గ్రామస్థులు డిమాండ్ చేశారు. కేసును తారుమారు చేయవద్దని వారు కోరారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం సామాజిక ఆసుపత్రికి తరలించారు. సీసీ ఫుటేజీలను పరిశీలించి న్యాయం చేస్తామని ఎస్ఐ అప్పారావు తెలిపారని మృతుడి బంధువులు పేర్కొన్నారు.

కోడిగుడ్ల లారీ బోల్తా

వజ్రపుకొత్తూరు: బెండిగేటు వద్ద శుక్రవారం తెల్లవారుజామున కోడి గుడ్ల లారీ బోల్తాపడింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదని ఎస్ఐ రామారావు తెలిపారు. కాకినాడ నుంచి ఒడిశా రాష్ట్రం బరంపురం గుడ్ల లారీ వెళుతుండగా డ్రైవర్ నిద్రమత్తులో మలుపు వద్ద లారీని తిప్పుతుండగా బోల్తా పడింది. ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

కొత్తూరు: భామిని మండలం నుంచి శుక్రవారం ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. భామినికి చెందిన రమేష్ వద్ద నుంచి ట్రాక్టర్‌ను కర్లెమ్మ జంక్షన్ వద్ద స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అహ్మద్ తెలిపారు.

కిల్లిపేటలో లారీతో..

శ్రీకాకుళం క్రైం: రూరల్ మండలం కిల్లిపేట గ్రామంలో సచివాలయం పరిధిలో అక్రమంగా లారీలో ఇసుక తరలిస్తుండగా రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు.ఈ మేరకు లారీ డ్రైవర్‌ను రూరల్ పోలీసులకు అప్పగించి లారీని పోలీసుల కస్టోడియన్‌కు అప్పగించారు. లారీని పట్టుకున్న వారిలో వీఆర్వోలు ఎ.తవుడు, కె.అప్పారావు, శాంతారావు, జె.జయకృష్ణ, కె.చంద్రరావులున్నారు.

వ్యవసాయ రంగాన్ని కాపాడుకుందాం

అరసవల్లి: క్విట్ ఇండియా డే స్ఫూర్తితో కార్పొరేట్ కంపెనీల నుంచి వ్యవసాయ రంగాన్ని కాపాడుకుందామని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ తాండ్ర ప్రకాష్, ఏపీ రైతు సంఘ జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు అన్నారు. కేంద్రం అవలంభిస్తున్న రైతాంగ, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నగరంలోని పాత బస్టాండ్ వద్ద 'క్విట్ కార్పొరేట్' నినాదంతో నిరసన తెలిపారు. ఎన్జీవో హోమ్ నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు అల్లు మహాలక్ష్మి, తాండ్ర అరుణ, పోలాకి ప్రసాదరావు, భవిరి కృష్ణమూర్తి, సూరయ్య, నీలంరాజు, సురేష్‌కుమార్, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలు

విజయనగరం టౌన్: విజయనగరంలోని సర్‌విజ్జీ మైదానం, పీవీజీ రాజు నార్త్‌జోన్ క్రికెట్ అకాడమీ మైదానంలో సీనియర్ పురుషుల అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలు హోరా హోరీగా సాగుతున్నాయి. సర్‌విజ్జీ మైదానంలో తూర్పుగోదావరి-విజయనగరం జిల్లా జట్ల మధ్య శుక్రవారం ప్రారంభమైన మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో తూర్పుగోదావరి జట్టు 70.2 ఓవర్లలో 250 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులో ఏవీవీ విజయ్, పి.పాండురంగా అర్ధసెంచరీలు సాధించారు. విజయనగరం జట్టులో బౌలర్లు సమష్టిగా రాణించి తూర్పుగోదావరి జట్టు బ్యాట్స్‌మెన్లను కట్టడి చేశారు. పి.తేజస్వీ 18 ఓవర్లలో 43 పరుగులు ఇచ్చి నాలుగు వికెట్లు పడగొట్టారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన విజయనగరం జట్టు ఆటముగిసే సమయానికి 17 ఓవర్లలో ఒక్క వికెట్ నష్టపోయి 58 పరుగులు చేసింది. కెప్టెన్ పి.తపస్వీ 30 పరుగులు, ఎస్.హరీష్ 18పరుగులతో క్రీజ్ ఉన్నారు. కాగా పీవీజీ రాజు నార్త్‌జోన్ క్రికెట్ అకాడమీ మైదానంలో విశాఖపట్నం, శ్రీకాకుళం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో విశాఖ జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. ఆ జట్టు బ్యాట్స్‌మెన్లు సమష్టిగా రాణించి 69.2 ఓవర్లలో 330 పరుగులు సాధించారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీకాకుళం జట్టు 14 ఓవర్లలో 34/1 పరుగులు చేసింది.

అతివేగమే ప్రమాదాలకు కారణం

ఇచ్ఛాపురం: వాహనాలను అతివేగంగా నడపడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్, పట్టణ ఎస్ఐ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం సురంగిరాజా మైదానంలో స్కూల్ బస్సుల యాజమాన్యాలకు, బస్సు డ్రైవర్లుకు అవగహన కార్యక్రమం నిర్వహించారు. స్కూల్ బస్సులు నడిపే డ్రైవర్లు అత్యంత జాగ్రత్తగా బస్సులు నడపాలన్నారు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉంచుకోవాలన్నారు. పిల్లల జీవితాలు డ్రైవర్లపైనే ఆదారపడి ఉంటాయన్నారు. పరిమితికి మించి పిల్లలను బస్సుల్లో ఎక్కించొద్దన్నారు. నిబంధనలకు విరుద్ధంగా స్కూల్ బస్సులు నడిపితే కేసులు నమోదు చేయడంతో పాటు డ్రైవర్ లైసెన్సు రద్దు చేస్తామని హెచ్చరించారు. అనంతరం మైదానంలో బస్సుల ఫిట్‌నెస్ మరోసారి తనిఖీ చేశారు. కార్యక్రమంలో యజమానులు, బస్సు, వ్యాన్‌ల డ్రైవర్లు పాల్గొన్నారు.


టెక్కలి: విద్యార్థినుల ఆదివాసీ సంప్రదాయ నృత్య ప్రదర్శన


కంచిలి: నువాగడలో విద్యార్థులతో ర్యాలీ

సందడిగా ఆదివాసీ దినోత్సవం

ప్రపంచ ఆదివాసీ దినోత్సవం గురువారం జిల్లాలో సందడిగా నిర్వహించారు. గిరిజన సంప్రదాయ నృత్యాలతో యువత ఆకట్టుకున్నారు. ఆదివాసీ వ్యతిరేక చట్టాలపై పోరాటం చేయాలని, జిల్లాలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలని ర్యాలీలు చేపట్టారు. 1/70 చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

- ఆంధ్రజ్యోతి బృందం


పాతపట్నం: పతాక ఆవిష్కరణలో ఆదివాసీ సంఘాల నాయకులు..


పలాస రూరల్: గట్టూరులో గిరిజన సంఘాల నేతల ర్యాలీ


కొత్తూరు: మాట్లాడుతున్న గిరిజన సంఘ నాయకుడు నిమ్మక అప్పన్న

బాధితులకు సెల్‌ఫోన్లు అందజేత


బాధితులకు సెల్ ఫోన్ అందిస్తున్న ఎస్పీ

శ్రీకాకుళం క్రైం: మానవ జీవనంలో ఫోన్ ఒక భాగమైన తరుణంలో ప్రజలు పలు కారణాల వల్ల ఫోగొట్టుకున్న తమ సెల్ ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్‌లో వెంటనే ఫిర్యాదు చేస్తే రికవరీ చేసి బాధితులకు అందజేస్తామని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. జిల్లాలో జూన్ 21 నుంచి పోయిన 15 లక్షల విలువైన సుమారు 100 ఫోన్లను రికవరీ చేసి జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం బాధితులకు ఎస్పీ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. నేటికి జిల్లాలో 2021 డిసెంబరు నుంచి నేటికి 79 లక్షల విలువైన 618 ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేశామన్నారు. సెల్ ఫోన్లు పోగొట్టుకున్న బాధితులు హెచ్‌టీటీపీఎస్‌://డబ్ల్యూడబ్ల్యూ.సీఈఐఆర్.జీవోవీ.ఇన్‌లో తక్షణమే ఫిర్యాదు చేయాలన్నారు. సమావేశంలో ఏఎస్పీ జి.ప్రేమ్ కాజల్, సైబర్ సెల్ సీఐ టి.శ్రీను, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి సారించాలి

పొందూరు: యువత అసాంఘిక కార్యకలాపాల వైపు మళ్లకుండా తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేక దృష్టిని సారించామని ఎస్పీ మహేశ్వరరెడ్డి తెలిపారు. పొందూరు పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం రాత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. ఇటీవల యువతలో పెరుగుతున్న గంజాయి, మత్తుపదార్థాల వినియోగానికి కారణం, వీటిని సరఫరా చేస్తున్న మార్గాలపై నిఘా పెట్టామన్నారు. వివిధ అంశాలపై ఎస్ఐ రమణ చర్చించారు. అనంతరం రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

నాణ్యమైన విద్య అందించడం ప్రభుత్వ బాధ్యత


పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

పొందూరు: రాష్ట్రంలో విద్యార్థులకు నైపుణ్యాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించడం ప్రభుత్వం బాధ్యతని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పాఠ్య, నోట్ పుస్తకాల పంపిణీలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలకేంద్రంలో ఐదు ఎకరాల్లో డిగ్రీ కళాశాలకు నూతన భవనాలను నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఐ.మల్లేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు సీహెచ్ రామ్మోహన్, పట్టణ అధ్యక్షుడు చినరంగ, ఎంపీటీసీ వాణి, నాయకులు బలగ శంకరభాస్కర్, బాడాన గిరి, అనకాపల్లి విజయలక్ష్మి, వి.మురళి, కె.శ్రీనివాసరావు ఎం.శ్రీనివాసరావు, డి.రవి తదితరులు పాల్గొన్నారు. కాగా ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత మొదటిసారిగా పొందూరు పట్టణానికి వచ్చిన కూన రవికుమార్‌కు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. బాణసంచా కాల్చుతూ మంగళవాయిద్యాలతో సందడి చేశారు.

యువత భాగస్వామ్యం కావాలి


కంప్యూటర్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

రణస్థలం: యువత సామాజిక కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. శుక్రవారం కోష్టలో రోటరీ క్లబ్ సైబరాబాద్, ఏటీటీ కమ్యునికేషన్ సర్వీసెస్ ఇండియా అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ పిసిని వెంకట సత్యనారాయణ 41 ప్రభుత్వ పాఠశాలలకు కంప్యూటర్లు పంపిణీ చేసే కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మండలంలోని 108 పాఠశాలకు కంప్యూటర్లు అందజేస్తామని, తొలత 41 పాఠశాలలకు కంప్యూటర్లు అందించినట్టు వెంకట సత్యంనారాయణ స్పష్టం చేశారు. మాజీ సర్పంచ్ పిసిని జగన్నాథంనాయుడు, పిసిని లక్ష్మి, ఎంపీటీసీ అసిరినాయుడు, డీజీఎం ఆనందరావు, పైడి అప్పడొర తదితరులు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాల నియంత్రణే లక్ష్యం

అరసవల్లి: మాతాశిశు మరణాల నియంత్రణే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని డీఎంహెచ్‌వో బొడ్డేపల్లి మీనాక్షి అన్నారు జిల్లాలో పట్టణ, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో ఉన్న ఆశా నోడల్ అధికారులకు కిల్కారి మొబైల్ అకాడమీ సేవలపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మాతా, శిశు ఆరోగ్యానికి భద్రత, గర్భిణులు, బాలింతలు, శిశువుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. గర్భం దాల్చిన నాటి నుంచి స్థానిక ఏఎన్ఎం వద్ద గర్భస్థ వివరాలను నమోదు చేసుకునేటప్పుడు సేకరించిన మొబైల్ నెంబర్‌కు ఈ కిల్కారి వాయిస్ కాల్స్ వస్తాయన్నారు. ఆశా కార్యకర్తలకు విజ్ఞానాన్ని మరింత అందించేందుకు మొబైల్ అకాడమీ కోర్సుని 11 మాడ్యూల్స్ ద్వారా అందించనున్నామన్నారు. తల్లి, బిడ్డల ఆరోగ్యాన్ని సంరక్షించే ఈ కార్యక్రమంపై ప్రతీ గర్భవతికి అవగాహన కల్పించే దిశగా కృషి చేయాలన్నారు.

బాలికా విద్యతోనే నవ సమాజ స్థాపన


మాట్లాడుతున్న న్యాయాధికారి సన్యాసినాయుడు

శ్రీకాకుళం రూరల్: నవ సమాజ స్థాపన బాలికా విద్యతోనే సాధ్య పడుతుందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. సింగుపురం గ్రామ సమీపంలో ఉన్న కేజీబీవీ పాఠశాలలో శుక్రవారం వన్‌స్టాప్ సెంటర్ ఆధ్వర్యంలో ఆడపిల్లని బతకనిద్దాం.. చదవనిద్దాం.. ఎదగనిద్దాం అనే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే శంకర్ హాజరై విద్యార్థులతో అక్కడి సౌకర్యాలపై చర్చించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయాధికారి ఆర్.సన్యాసినాయుడు మాట్లాడుతూ.. సమాజంలో నడవడిక కొనసాగించాలంటే చట్టాలు తప్పనిసరిగా తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జె.లలిత, సర్పంచ్ గుండ ఆదిత్యనాయుడు, పీఎఫ్‌వో కె.రేణుకరాణి, సోషల్ కౌన్సిలర్ ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ శ్రీకాకుళంగా తీర్చిదిద్దుదాం


సమీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకర్, కమిషనర్ ఓబులేసు

అరసవల్లి: రాష్ట్రంలోనే ఒక ఆదర్శంగా శ్రీకాకుళం నగరాన్ని తీర్చిదిద్దడంలో అందరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే గొండు శంకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం నగర కార్పొరేషన్ అధికారులు, కాంట్రాక్టర్లతో నగర కమిషనర్ కార్యాలయంలో ఆయన సమీక్షించారు. నగరంలో కాలువలు, రోడ్లు, పార్కులను నిర్మించి ప్రజలకు త్వరితగతిన అందజేయాలని సూచించారు. ఇప్పటివరకు నగరంలో 88 పనులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. కమిషనర్ చల్లా ఓబులేసు, కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు పోలీసు సేవలు మరింత చేరువ చేస్తాం

శ్రీకాకుళం క్రైం: ప్రజలకు పోలీసు సేవలు మరింత చేరువ చేస్తామని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత జిల్లాలోని పలు పోలీసు స్టేషన్లను సందర్శించి సమస్యలు గుర్తించారు. ఈ మేరకు కొన్ని ప్రాంతాల్లో పోలీసు స్టేషన్లు ప్రజలకు దూరంగా ఉండడాన్ని ఆయన గుర్తించారు. ఈ క్రమంలో ఎల్ఎన్ పేటలో కొత్తగా పోలీసు స్టేషన్ ఏర్పాటు చేయనున్నట్టు ఎస్పీ వెల్లడించారు. జిల్లాలో గంజాయి, మైనర్ డ్రైవింగ్, రహదారి ప్రమాదాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. సైబర్ క్రైంలో నగదు పోగొట్టుకున్న వారు తక్షణమే ఫిర్యాదు చేస్తే నగదు రికవరీ చేయగలమన్నారు.

కాంగ్రెస్‌తోనే దేశంలో సుపరిపాలన


పతాక ఆవిష్కరణలో కాంగ్రెస్ నాయకులు

అరసవల్లి: దేశంలో సామ్యవాద విధానం, పేదరిక నిర్మూలన, సుపరిపాలన కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి అన్నారు. క్విట్ ఇండియా దినోత్సవం సందర్భంగా స్థానిక ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో డీసీసీ అధ్యక్షుడు పేడాడ పరమేశ్వరరావు పతాకావిష్కరణ గావించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కృపారాణి మాట్లాడుతూ.. రాహుల్ గాంధీని భారత ప్రధానిగా చూడాలనేది దేశ ప్రజల ఆకాంక్షన్నారు. ఆయన ప్రధాని అయ్యేంత వరకు మనమంతా శ్రమించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీజీ మల్లిబాబు, సనపల అన్నాజీరావు, మంత్రి నర్సింహమూర్తి, రెల్ల సురేష్, ఈశ్వరి, కొత్తూరు శైలజ, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఏయూలో పంద్రాగస్టు పోటీలు


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న వీసీ రజని

ఎచ్చెర్ల: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో బోధనా, బోధనేతర సిబ్బందికి, విద్యార్థులకు వేర్వేరుగా శుక్రవారం వివిధ పోటీలు నిర్వహించారు. పలు క్రీడా, సాంస్కృతిక, రచనా సంబంధిత పోటీలను నిర్వహిస్తున్నారు. బోధనేతర సిబ్బందికి క్రికెట్ పోటీలను వీసీ కేఆర్ రజని ప్రారంభించారు. జానపద నృత్యాలు, వ్యాసరచన, ఏకపాత్రాభినయం, క్యారమ్స్, బ్యాడ్మింటన్ తదితర పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ పి.సుజాత, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ఉదయభాస్కర్, ఓఎస్‌డీ యు.కావ్యజ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు. వర్సిటీ అధ్యాపకులు ఎం.శ్రీనివాస్, పి.రవికుమార్, కె.ఉదయకిరణ్ తదితరులు ఈ పోటీలను పర్యవేక్షించారు.

ముద్దాడపేట ఎత్తిపోతల నుంచి నీరు విడుదల

ఎచ్చెర్ల: ముద్దాడపేటలో రైతులు స్వయంగా నిర్వహిస్తున్న ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీటిని శుక్రవారం విడుదల చేశారు. నారాయణపురం ప్రాజెక్ట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు పంచిరెడ్డి సత్యనారాయణ, మాజీ సర్పంచ్ పంచిరెడ్డి కృష్ణారావు ఆధ్వర్యంలో సాగునీటిని విడుదల చేశారు. నాగావళి నది ఒడ్డున ఈ గ్రామంలో గత కొన్నేళ్లుగా ఎత్తిపోతల పథకాన్ని రైతులే స్వయంగా నిర్వహించుకుంటున్నారు. ముద్దాడపేట, బింగుపేట, గురువుపేట, పంచిరెడ్డిపేట, కాపుపేటలతో పాటు పొన్నాడ, కమ్మపేట, బొంతలకోడూరు గ్రామాల్లోని కొంత భాగానికి ఈ ఎత్తిపోతల ద్వారా సాగునీరు అందుతుంది. సుమారు 350 మంది రైతులకు చెందిన దాదాపుగా 450 ఎకరాల ఆయకట్టుకు నీరు అందించే ఎత్తిపోతలతో రైతులు ఏడాదికి రెండు పంటలు సాగుచేస్తున్నారు. నదిలో నీరు లభ్యంగా ఉంటే మూడో పంటను కూడా సాగుచేసేందుకు రైతులకు ముందుకువస్తున్నారు. 2015 సంవత్సరానికి ముందు మూడేళ్లపాటు ఈ పథకం మూలనపడింది. దీని పరిస్థితిపై అప్పట్లో 'ఆంధ్రజ్యోతి'లో ప్రముఖంగా ప్రచురించడంతో ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద రూ.26 లక్షలు విడుదల చేసి బాగు చేయించారు. దీంతో అప్పటి మంత్రులు పరిటాల సునీత, కింజరాపు అచ్చెన్నాయుడు, ఎచ్చెర్ల ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు, జడ్పీ ఛైర్‌పర్సన్ చౌదరి ధనలక్ష్మి హాజరై పునః ప్రారంభించారు. ఎత్తిపోతల పంపుసెట్ నుంచి కవిచెరువు వరకు 1,250 మీటర్లు ఉండే ఈ కాలువ అప్పట్లో జన్మభూమి నిధులతో సుమారు 120 మీటర్ల వరకూ సిమ్మెంటుతో నిర్మించారు. కాలువను లెవెల్ చేయడానికి, సిమ్మెంట్‌తో నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ప్రస్తుతం రైతులు కోరుతున్నారు. కార్యక్రమంలో రైతులు మూకళ్ల రామారావు, పొదిలాపు అప్పయ్య తదితరులు పాల్గొన్నారు.


సాగునీటిని విడుదల చేస్తున్న రైతులు

ఓనిగెడ్డ నుంచి..


సాగునీటిని విడుదల చేస్తున్న దృశ్యం

బూర్జ: మండల పరిధిలోని పలు వ్యవసాయ క్షేత్రాలకు సాగునీరు అందించే ఓనిగెడ్డ నుంచి శుక్రవారం నీటిని విడుదల చేశారు. ఇరిగేషన్ జేఈ శంకరరావు, స్థానిక నాయకుల ఆధ్వర్యంలో నీటిని విడుదల చేశారు. జేఈ మాట్లాడుతూ.. ఓనిగెడ్డ వద్ద కొత్త షట్టర్లను ఏర్పాటు చేసి శివారు ఆయకట్టుకు సాగునీరు అందిస్తామన్నారు. వంశధార, నాగావళి నదుల నుంచి కాలువల ద్వారా అందేలా జేసీబీలతో గుర్రపుడెక్క తొలగించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఐజీ కుమార్, నాయకులు కడగల కృష్ణ, పీరుకట్ల ప్రభాకరరావు, వారాడ రాంబాబు, జడ్డు కృష్ణ, మౌళి, ఆదినారాయణ, వెంకునాయుడు, రైతులు పాల్గొన్నారు.

మెగా జాబ్ మేళా రేపు

రణస్థలం: స్థానిక ఎన్ఈఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఈ నెల 11వ తేదీన మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్టు, ఈ అవకాశాని యువత సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్‌కు చెందిన ఎంఎంఎస్ఎస్ ల్యాబ్ పరిశ్రమ వారు నిర్వహించే ఈ జాబ్ మేళాకు 20 ఏళ్ల లోపు, ఇంటర్ బైపీసీ, ఎంపీసీలో 60 శాతం మార్కులుతో ఉత్తీర్ణత సాధించిన పురుష అభ్యర్థులు హాజరుకావాలని తెలిపారు. పూర్తి వివరాల కోసం ఎన్ఈఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు.

నేర నియంత్రణకు కృషి చేస్తా


ఎస్పీని కలిసి సీఐ పైడపునాయుడు

శ్రీకాకుళం క్రైం: సర్కిల్ పరిధిలో నేర నియంత్రణకు తనవంతు కృషి చేస్తానని శ్రీకాకుళం సీఐ కె.పైడపునాయుడు తెలిపారు. ఇటీవల జరిగిన సీఐల బదిలీల్లో శ్రీకాకుళం సీఐ నియమితులైన కె.పైడపునాయుడు శుక్ర వారం బాధ్యతలు చేపట్టారు. 2000లో ఎస్‌గా విధుల్లో చేరిన ఆయన వన్‌టౌన్‌లో ట్రైనీ ఎస్ఐగా విధులు నిర్వహించారు. అక్కడ నుంచి పాతపట్నం, హిరమండలం, నరసన్నపేటలో ఎస్ఐగా బాధ్యతలు నిర్వహించి విశాఖ బదిలీపై వెళ్లారు. 2010లో సీఐగా పదోన్నతి పొందిన న్యూపోర్టు గాజువాకలో విధులు నిర్వహించి ఇచ్ఛాపురం, మళ్లీ విశాఖ విజిలెన్స్ అక్కడి నుంచి సీఐడీలో పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. అలాగే సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లాలో శ్రీకాకుళం రూరల్, నరసన్నపేట సీఐలుగా బాధ్యతలు చేపట్టిన కె.పైడపునా యుడు, జె.శ్రీనివాసరావు శ ఎస్పీ ని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

ఖాతాదారుల నమ్మకాన్ని నిలబెట్టాలి


జ్యూయలరీ మార్ట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

నరసన్నపేట: పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎంఎం జ్యూయలరీ మార్ట్ ను ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో నరసన్నపేట బంగారం వ్యాపారానికి పేరు పొందిందని ఆ పేరుతో పాటు ఖాతాదా రుల నమ్మకాన్ని నిలబెట్టాలన్నారు. కార్యక్రమంలో టెక్కలి నియోజవర్గ టీడీపీ నాయకుడు కింజరాపు హరివరప్రసాద్, ఎంఎం జ్యూయలరీ మార్ట్ ఎండీలు వారణాశి మురళి, తంగుడు ఆదిత్య మాజీ సర్పంచ్ గొద్దు చిట్టిబాబు, ఉణ్న వెంకటేశ్వరరావు, జామి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ ఉచిత శిక్షణతో సేవా కార్యక్రమాలకు శ్రీకారం


శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

పాతపట్నం: టెట్, డీఎస్సీ ఉచిత శిక్షణతో సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నామని నియోజకవర్గ జనసేన నాయకురాలు కొరికాన భవాని అన్నారు. కొరికాన కాంపిటేటివ్ ఆకాడమీ ఆధ్వర్యంలో టెట్, డీఎస్సీ ఉచిత శిక్షణను జనసేన జిల్లా అధ్యక్షుడు పిసిపి చంద్ర మోహన్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ స్ఫూర్తితో అత్యంత వెనుకబడిన పాతపట్నం అభివృద్ధిపై దృష్టి సారించామన్నారు. ముందుగా నిరుద్యోగ యువ తను ఆదుకునేందుకు ఈ కార్యక్రమాన్ని నిపుణుల తో నిర్వహిస్తున్నామని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పార్టీ నాయకుడు కొరికాన రవికుమార్, డాక్టర్ దానేటి శ్రీధర్, డాక్టర్ జి.రాజేశ్వరరావు, నియోజకవర్గ ఇన్‌చార్జి గేదెల చైతన్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

శ్రీకాకుళం క్రైం: ప్రతీ విద్యార్థికి చట్టాలపై అవగాహన ఉండాలని శ్రీకాకుళం సీఐ కె.పైడపునాయుడు సూచించారు. నగరంలోని వివిధ కళాశాల విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ర్యాగింగ్, బ్యాడ్ టచ్, గుడ్ టచ్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడపొద్దన్నారు.

హక్కులు సాధించుకోవాలి

అరసవల్లి: రెల్లి, రెల్లి ఉపకులాల వారు అందరూ ఐక్యతగా ఉండి పోరాటం చేసి హక్కులను సాధించుకోవాలని ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు డాక్టర్ ఎ.మోహనరావు కోరారు. శుక్రవారం సాయంత్రం నగరంలోని పెద్దరెల్లి వీధిలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ తీర్పుపై సమావేశం నిర్వహించారు. ఈ వర్గీకరణలో 5శాతం ఉత్తరాంధ్ర వారికి కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో అరుగుల కుమారస్వామి, ఎస్.ప్రసాదరావు, ఇంటి గోవిం దరావు, ఏ.పురుషోత్తం పాల్గొన్నారు.

లేత వరినారుతో మేలు

జి.సిగడాం: సాగులో లేత వరినారుతో నాట్లు వేయడం వల్ల చీడపీడలను, తెగుళ్లను అధిగమించవచ్చని ఏడీఏ వి.శ్రీనివాసరావు అన్నారు. రైతు సేవా కేంద్రం పరిధిలో (గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీసెస్) భాగంగా శుక్రవారం జగన్నాథవలస గ్రామంలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. కాలిబాటలు వేసుకోవడం వల్ల దోమపోటు, తెగుళ్లను నివారించవచ్చన్నారు. ఏవో ఈఆర్‌పి శ్రీనివాసరావు, వీఏఏలు అలుగోలు లక్ష్మీనారా యణ, అనూష్, రాణి, సంతోష్‌కుమార్, పాల్గొన్నారు.

బాల్య వివాహాలు జరుగకుండా దృష్టి సారించాలి

అరసవల్లి: బాల్య వివాహాలు జరగకుండా అధికారులు, సిబ్బంది ప్రత్యేకంగా దృష్టి సారించాలని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు సీతారాం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎట్టి పరిస్థితుల్లోను బాల్య వివాహాలు జరగకూడదనే లక్ష్యంతో ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, దేవదాయ శాఖ, పోలీసు, వార్డు సచివాలయ శాఖలు, గ్రామీణాభివృద్ధి, రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్, సమాచార పౌర సంబంధాల శాఖ, జిల్లా బాలల సంరక్షణ అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నట్టు తెలిపారు.